క్లుప్తంగా

నీటిలో నిలబడి నిరసన



మైలవరం: రోడ్డుపై నీరు నిలవకుండా డ్రైయినేజీ నిర్మించాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. చంద్రగూడెం మసీదు సెంటర్ వద్ద మోకాలి లోతు నీళ్లలో నిలబడి మంగళవారం నిరసన తెలిపారు. వజ్రాల వెంకటరెడ్డి మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికి సైతం చంద్రగూడెం గ్రామంలోని మసీదు సెంటర్ వద్ద రహదారిపై నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోజుల తరబడి వర్షం నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామస్తులు సూరిబాబు, సదా శివరావు, బోలగాని రాజా, వి. నాగేశ్వరరావు, సంగు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

నూజివీడు: నూజివీడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ శుక్రవారం తెలిపారు. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

రోడ్డుపైనే పశువుల తిష్ట



ఆగిరిపల్లి: ఆగిరిపల్లి ప్రధాన రహదారిలో రాత్రి పూట ఆవులు, ఎద్దులు విచ్చలవిడిగా సంచరించి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో వాహనదారులు మూగజీవాల కారణంగా ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారు. మూగజీవాలు ఆకలికి తట్టుకోలేక కూరగాయలు, పండ్ల దుకాణాల వద్ద రోడ్లపై అడ్డంగా బైఠాయిస్తున్నాయి. పశువులు రోడ్లపై సంచరించకుండా మూగజీవాల యజమానులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధ్యాపకునికి పీహెచ్‌డీ ప్రదానం

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగాధిపతి మల్లారపు శ్రీనివాసరావుకు పీహెచ్‌డీ లభించింది. పబ్లిక్, ప్రైవేట్ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు ఫైనాన్షియల్ నిర్వహణలో పునరుద్ధరణ, వ్యూహాల పాత్ర, ప్రాముఖ్యత అంశంపై పరిశోధన పత్రాన్ని ఆయన సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, కళాశాల సిబ్బంది, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

ఆదమరిస్తే అంతే!



నూజివీడు: మండలంలోని హరియాతండా స్టేజీ, లైన్‌తండా గ్రామాల మధ్యలో నూజివీడు-రెడ్డిగూడెం ఆర్‌అండ్‌బీ రహదారిపై కొల్లు గార్డెన్ గేటు ఎదురుగా పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. గుంత ఏర్పడటంతో దానిని గుర్తించేందుకు వీలుగా స్థానికులు కర్రకు ఎర్రగుడ్డ కట్టి గుంతలో ఉంచారు. ప్రమాదాలు జరుగకముందే గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగాలకు 9 మంది ఎంపిక



విస్సన్నపేట: బహుళజాతి ఎలక్ట్రికల్ వెహికల్ మ్యానుఫ్యాక్చర్ సంస్థ ఇక్సీకామ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో స్థానిక వికాస్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం క్యాంపస్ సెలక్షన్స్ జరిగాయి. 9 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి మూడు నెలలు ఢిల్లీలో శిక్షణ ఇచ్చి అనంతరం హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి, సంస్థ ప్రతినిధులు అభినందించారు.

జూదరుల అరెస్ట్

ఆగిరిపల్లి: సురవరంలో చిత్తులాట ఆడుతున్న వారిపై ఎస్‌ఐ శుభ శేఖర్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.5,100 నగదును స్వాధీనం చేసుకున్నారు.

తిరువూరు సర్కిల్‌లో పెరుగుతున్న నేరాలు

- చోరీ ఘటనలతో ప్రజల బెంబేలు
- గంజాయి మత్తులో యువత హల్‌చల్
- ద్విచక్ర వాహనాల చోరీలూ అధికమే



తిరువూరు శివారులో అనుమానితులను విచారణ చేస్తున్న పోలీసులు (ఫైల్)



ఒడిశా నుంచి గంజాయి తరలిస్తూ తిరువూరులో పట్టుబడిన యువకులు (ఫైల్)

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో ఏడాది కాలంగా నేరాల సంఖ్య పెరిగింది. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల్లో ద్విచక్ర వాహనాల చోరీలు, రేషన్ బియ్యం అక్రమ రవాణా, గంజాయి స్మగ్లింగ్ వంటి నేరాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. విస్సన్నపేటకు చెందిన ఒక రిటైర్డు ఉద్యోగిని డిజిటల్ అరెస్టు పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు బెదిరించి లక్షలాది రూపాయలు దోచుకున్న ఘటన ఈ ప్రాంత ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. పేకాట వంటి జూదాలు గ్రామాల్లో నిత్యం జరుగుతున్నాయని గ్రామీణ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. తిరువూరు, మల్లేల, చిట్టేల, గంపలగూడెం, విస్సన్నపేటలో నివాస గృహాల నడుమ జూదాలు జరుగుతుండగా చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలుగుతోంది.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా...

తిరువూరు నియోజకవర్గంలోని అధికశాతం గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. దేవాలయాల్లోని హుండీలను సైతం చోరీ చేస్తుండటం, ఒంటరిగా వెళ్లే మహిళలు, వృద్ధుల మెడలో బంగారు ఆభరణాలు చోరీ చేయడం వంటి నేరాల్లో యువత పాల్గొంటున్నారు. 15 సంవత్సరాల నుంచి 20 ఏళ్ల లోపు యువకులు, విద్యార్థులు ఒడిశా నుంచి ద్విచక్ర వాహనాలపై గంజాయి తెచ్చి తిరువూరులో విక్రయించడం, హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాలకు రవాణా చేయడం వంటి ఘటనలు పరిపాటయ్యాయి. గత ఏడాది కాలంలో తిరువూరు సర్కిల్‌లో పదికి పైగా గంజాయి కేసులు నమోదవడం గమనార్హం. తిరువూరు, విస్సన్నపేట, గంపలగూడెం మండల కేంద్రాల్లోనే గంజాయి అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తిరువూరు పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల సమీపంలోనే నిషేధిత సిగరెట్లు, గంజాయి వంటి మత్తు పదార్థాల అమ్మకాలు జరుగుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి వీటిని నియంత్రించాలని కోరుతున్నారు.

అపరిచిత వ్యక్తుల సంచారం

తిరువూరు సర్కిల్‌లో అపరిచిత వ్యక్తుల సంచారంపై పోలీసుల నిఘా కొరవడింది. తిరువూరు పట్టణ శివారు ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నివాసం ఉంటున్న వ్యక్తుల్లో నేరస్తుల గుర్తింపునకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు అనుమానితులపై తీసుకున్న చర్యలు బహిర్గతం కావడం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి జీవనోపాధి కోసం వస్తున్న వారితో పాటు కొందరు నేరాలకు పాల్పడే వ్యక్తులు కూడా ఉన్నట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నివాస ప్రాంతాల్లో బహిరంగ మద్యపాన సేవనం చేస్తుండటం కూడా స్థానికులకు ఇబ్బంది కలిగిస్తోంది. తిరువూరు పట్టణంలో మైనారిటీ తీరని యువకులు ద్విచక్ర వాహనాలపై అపరిమిత వేగంతో హల్‌చల్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు



చోరీల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలతో పాటు మరో 150 సీసీ కెమేరాలను నేరాలు ఎక్కువగా జరిగే ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తాం. కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి వస్తున్న నేరగాళ్లు చోరీలకు పాల్పడుతున్నారు.

–సత్యనారాయణ, తిరువూరు సెక్టార్-1 ఎస్‌ఐ

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



ఆగిరిపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సబ్ కలెక్టర్ బి. వినూత్న అన్నారు. సోమవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈదర గ్రామానికి చెందిన రైతు కట్టాల వెంకటేశ్వరరావు బొద్దనపల్లిలో తన పొలంలోకి వెళ్లడానికి దారి లేకుండా ఫెన్సింగ్ వేశారని ఫిర్యాదు చేశాడు. దీంతో మంగళవారం సబ్ కలెక్టర్ పొలానికి వెళ్లే దారిని పరిశీలించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ ప్రసాద్‌కు సూచించారు. ఆమెతోపాటు ఆర్‌ఐ మహమ్మద్ యూనస్, సర్వేయర్ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన

తిరువూరు: మండలంలోని ఎర్రమాడు, పెద్దవరం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి పద్మ వరి పైరులో సస్యరక్షణ చర్యలు, పత్తిపంటలో రసం పీల్చే పురుగు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ, నానో యూరియా చల్లడంపై అవగాహన కల్పించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



విస్సన్నపేటలో చెత్తబుట్టలో వేస్తున్న వ్యర్థాలు



పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

కొండపర్వ(విస్సన్నపేట): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ కె. శంకరరావు అన్నారు. మండలంలోని కొండపర్వ జెడ్పీ హైస్కూల్‌లో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాల పరిసరాలు శుభ్రం చేశారు. పాఠశాల హెచ్‌ఎం గంటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

● **నూజివీడు:** అన్నవరం హైస్కూల్‌లో మంగళవారం స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాన్ని ఇన్‌చార్జి హెచ్‌ఎం పి. రవీంద్ర నేతృత్వంలో నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిపి పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలల పరిసరాలతో పాటు మన ఇంటి పరిసరాలను ప్రతి రోజూ శుభ్రం చేసుకోవడం ద్వారా వ్యాధులు మన దరి చేరకుండా ఉంటాయన్నారు. చెత్తను ఎక్కడబడితే అక్కడ పడేయకుండా చెత్త కుండీలలోనే వేయాలన్నారు. పరిశుభ్రత ప్రాధాన్యతను గుర్తెరిగి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

నూజివీడు: అమెరికా విధించిన సుంకాలతో నష్టపోతున్న ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి. హరినాథ్ డిమాండ్ చేశారు. సుంకాలు పెరగటంతో రాష్ట్రంలో ఆక్వా రంగంపై ఆధారపడిన 2.5 లక్షల ఆక్వా రైతు కుటుంబాలతో పాటు ఆక్వా అనుబంధ రంగాలపై ఆధారపడిన 30 లక్షల మంది ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో పంటలు నష్టపోయినప్పుడు ప్రభుత్వం బోనస్ ఇచ్చినట్లుగా నేడు ఆక్వా రైతాంగానికి బోనస్ ఇవ్వాలని హరినాథ్ కోరారు. సుంకాల ప్రభావంతో రూ.25 వేల కోట్ల మేర నష్టం జరిగి ఉంటుందని, 50 శాతం మేర ఎగుమతుల ఆర్డర్లు రద్దయ్యాయన్నారు. ఆక్వా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చంద్రబాబు వైఫల్యం చెందారని ధ్వజమెత్తారు. రూపాయన్నరకు యూనిట్ విద్యుత్ సరఫరా చేస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ తక్షణం అమలు చేయడంతో పాటు ఎగుమతిదారుల ప్రయోజనాల కన్నా, నష్టపోతున్న ఆక్వారైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వారిని ఆదుకునేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓజోన్ పొర రక్షణ అందరి బాధ్యత



ఓ3 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

నూజివీడు: ఓజోన్ పొరను కాపాడటం అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని మద్దాయికుంట హైస్కూల్ హెచ్‌ఎం దారపురెడ్డి భాస్కరరావు అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మద్దాయికుంట హైస్కూల్‌లో మంగళవారం ఓజోన్ పొర ప్రాముఖ్యత, జీవరాశి మనుగడకు ఎలా ఉపయోగపడుతుందనే విషయాలపై హెచ్‌ఎం విద్యార్థులకు వివరించారు. ఓజోన్ సాంకేతిక నామమైన ఓ3 రూపంలో విద్యార్థులను కూర్చోబెట్టి అవగాహన కల్పించారు. సూర్యుడి నుంచి విడుదలయ్యే అతి నీలలోహిత కిరణాల నుంచి ఓజోన్ పొర మానవాళిని కాపాడుతుందన్నారు. ఓజోన్ పొరే లేకుంటే అతి నీల లోహిత కిరణాలు నేరుగా వచ్చి మన శరీరంపై పడేవని, దీంతో కేన్సర్ వంటి వ్యాధికి లోనయ్యేవారమని చెప్పారు. ఏసీలు, ఫ్రిజ్‌ల నుంచి విడుదలయ్యే ఫ్లోరో క్లోరో కార్బన్ వంటి వాయువుల వల్ల ఓజోన్ పొర దెబ్బతింటోందన్నారు. ఓజోన్ పొరను రక్షించుకోవాలంటే ఫ్రిజ్‌లను, ఏసీలను తక్కువగా వినియోగించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్‌ను తగ్గించాలని తద్వారా గ్లోబల్ వార్మింగ్ తక్కువ స్థితిలో ఉంచే విధంగా ప్రయత్నించాలని చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ వద్దంటూ నిరసన



ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

జి.కొండూరు: చెవుటూరు ప్రభుత్వ పాఠశాల పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి పిల్లల ప్రాణాలతో విద్యుత్ శాఖాధికారులు చెలగాటమాడుతున్నారని గ్రామస్తులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. పాఠశాల పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు పిల్లల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేసినా విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. గతంలో చందర్లపాడు మండల పరిధి అనాసాగరం ఉన్నత పాఠశాల విద్యార్థి పాఠశాల పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా షాక్‌కు గురై మృతిచెందిన ఘటనను గుర్తు చేస్తూ నిరసన తెలిపారు. పనులు ఆపకపోతే తామే నిలువరిస్తామని హెచ్చరించారు.

రేపటి నుంచి పాఠశాలల క్రీడా పోటీలు

తిరువూరు: తిరువూరు మండలంలో పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీలు ఈ నెల 18 నుంచి జరుగుతాయని తిరువూరు ఎంఈఓ శ్యామసుందర్ తెలిపారు. మల్లేలలో మంగళవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సమావేశంలో క్రీడా పోటీల నిర్వహణ తేదీలను ప్రకటించారు. 18న బాలికలకు తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో, 19న బాలురకు తిరువూరు ఎన్టీఆర్ స్టేడియంలో పోటీలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, ఎయిడెడ్, గురుకుల పాఠశాలల్లో 6 నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు అర్హులని చెప్పారు. ఇతర వివరాలకు పాఠశాలల వ్యాయామోపాధ్యాయులను సంప్రదించాలని కోరారు.

టైలర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వినతి



సీనియర్ అసిస్టెంటుకు వినతిపత్రం అందజేస్తున్న టైలర్లు

తిరువూరు: టైలరింగ్ వృత్తిలో జీవించే కుటుంబాలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని తిరువూరు మండల టైలర్స్, వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో టైలరింగ్ వృత్తిదారులు తమ డిమాండ్ల అమలు కోరుతూ మంగళవారం ఆందోళన నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ టైలరింగ్ వృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని, కుట్టుమిషన్లు ఉచితంగా అందజేయాలని, పాఠశాల విద్యార్థుల యూనిఫాం కుట్టే అవకాశం టైలర్లకు కల్పించాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు, టైలర్ల అసోసియేషన్ ప్రతినిధులు కోట శాంతకుమారి, సత్తార్, తులసీరాణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

శివాలయం వద్ద ఆక్రమణల తొలగింపు



శివాలయం వద్ద ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నూజివీడు: స్థానిక బస్టాండు రోడ్డులోని శివాలయం వద్ద దుకాణాల ముందు హోటళ్లు, మిఠాయి దుకాణాల నిర్వాహకులు చేసిన ఆక్రమణలను మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారి వెంకటేశ్వరరావు నేతృత్వంలో మంగళవారం రాత్రి తొలగించారు. ఇక్కడ దుకాణదారులు తమ షాపుల్లో నిర్వహించుకోకుండా డ్రెయినేజీపై, రోడ్డు మార్జిన్‌లో గ్యాస్ పొయ్యిలు పెట్టి వంటలు చేస్తుండటంతో అక్కడికి వచ్చిన వారు తమ వాహనాలను రోడ్డుపైనే పెడుతున్నారు. దీంతో ఇక్కడ ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ప్రజలు ట్రాఫిక్ కష్టాలను ఎదుర్కొనాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో స్థానికులు ట్రాఫిక్ ఇబ్బందుల గురించి మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావడంతో టీపీఓ వెంకటేశ్వరరావు సిబ్బందితో వచ్చి రోడ్డుపై ఆక్రమణలను తొలగింప చేశారు. మరలా రోడ్డుపై పెట్టి వంటలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నారీ శక్తి పరివార్ వైద్య శిబిరాలు

చాట్రాయి: స్వస్థ నారీ శక్తి పరివార్ అభియాన్ పథకంలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చనుబండ పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గా ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 17న చీపురుగూడెం, 18న చాట్రాయి, 19న చిత్తపూరు 2, 20న నరసింహారావుపాలెం, 22న పోలవరం, చనుబండ1, 23న చిత్తపూరు 1, పోతనపల్లి, 24న బూరుగుగూడెం, 25న జనార్ధనవరం, 26న చిన్నంపేట, 27న కోటపాడు, 29న తుమ్మగూడెం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాల్లో మహిళలు, బాలికలకు వైద్య సేవలు అందిస్తామని చెప్పారు.

అంత్యక్రియలకు అగచాట్లు



చనుబండ పెద్ద చెరువు వద్ద మునిగిన శ్మశానవాటిక స్థలం రోడ్డు

చాట్రాయి: అంత్యక్రియలు చేసేందుకు సరైన స్థలాలు లేక మృతుల కుటుంబ సభ్యులు నానా అగచాట్లు పడుతున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో శ్మశానవాటికలు లేక చెరువుల ముందు, చెరువు గట్ల పక్కన, రోడ్ల పక్కన అంత్యక్రియలు చేస్తున్నారు. చనుబండలో దళితులు అంత్యక్రియలు నిర్వహించే స్థానిక పెద్ద చెరువులోని శ్మశానవాటిక దారి నీళ్లతో మునిగి పోయింది. దీంతో అంత్యక్రియలు నిర్వహించాలంటే నానా ఇబ్బందులు పడుతున్నామని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళితులకు శ్మశానవాటిక లేకపోవడంతో రోడ్డు పక్కనే అంత్యక్రియలు చేస్తున్నారు. ఈ విధంగా అన్ని గ్రామాల్లో అనువైన శ్మశాన వాటికలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో శ్మశాన వాటికలకు స్థల సేకరణకు ఆదేశాలు ఇచ్చినా నేటి వరకు స్థలాలను ఎంపిక చేయలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ శ్మశానవాటికలు ఉన్నా అంత్యక్రియలు నిర్వహించడానికి సరైన వసతులు లేవని ప్రజలు వాపోతున్నారు.

నానో ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడీ హనుమంతరావు

పేరకలపాడు(కంచికచర్ల): మండలంలోని పేరకలపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించామని మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ కె.విజయకుమారి మట్లాడుతూ.. పీఎం ప్రణమ్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ పంటలకు ఎరువుల వినియోగం తగ్గించి నానో ఎరువులను, నానో డీఏపీ జీవనఎరువుల వాడకాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. దీని ద్వారా నేల సంరక్షణ, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు. అనంతరం రైతులతో కలిసి సాగుచేసిన పంట పొలాలను పరిశీలించారు. గాలికుంటు వ్యాధుల నివారణకు పశు సంవర్ధక శాఖ వైద్యుల సలహాల మేరకు అవసరమైన మందులు వాడాలన్నారు. సబ్సిడీ మేత, విత్తనాల పంపిణీ, పశువుల దాణా గురించి పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హనుమంతరావు వివరించారు. కిసాన్ క్రెడిట్ కార్డు, మినీ గోకులం షెడ్ పథకాల గురించి ఆయన రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నందిగామ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ మోసెస్, కంచికచర్ల డాక్టర్ జి.వెంగళరావు, మండల పశువైద్యాధికారి కె.విజయ విశ్వనాథ్, సర్పంచి సాత్విక, గ్రామ వ్యవసాయ సహాయకులు షాహిన్, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి బీజేపీ సేవా పక్షోత్సవాలు

నూజివీడు: ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా పక్షోత్సవాలను ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బోను అప్పారావు పేర్కొన్నారు. ఆ పార్టీ నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి అధ్యక్షతన మంగళవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదానం, స్వచ్ఛ భారత్, మొక్కలు నాటడం, క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

జి కొండూరు: అన్ని రంగాల్లోని కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీఐటీయూ జి.కొండూరు మండల తొమ్మిదవ మహాసభ స్థానిక కమ్యూనిటీ హాల్లో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డును వెంటనే ప్రారంభించాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు సత్వరమే విడుదల చేయాలని, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేసి పని భారం తగ్గించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.మహేష్, రైతు సంఘం నాయకుడు ఎస్.ప్రసాద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

విగ్రహం ధ్వంసం కేసులో ముగ్గురి అరెస్ట్

తిరువూరు: గంపలగూడెం తోటమూల సెంటర్‌లోని దివంగత సర్పంచి ఇనుగంటి రాంబాబు విగ్రహాన్ని ధ్వంసం చేసిన ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. తిరువూరు సీఐ గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి సమయంలో రాంబాబు విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేసినట్లు ఇనగంటి మధుసూదనరావు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంపలగూడెం మండలం పెదకొమెరకు చెందిన కొంగల వినాయకరావు, మోదుగు శ్రీనివాసరావు, ఇడుపులపాటి రాంబాబులను నిందితులుగా గుర్తించి అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరుపరిచారు. నిందితులను 14 రోజుల రిమాండ్‌కు మేజిస్ట్రేట్ ఆదేశించారు.

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పలు ట్రేడ్‌లలో ఉన్న ఖాళీల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రధానాధికారి పి. రజిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా ఐటీఐ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన ప్రింటవుట్‌ను తీసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 27న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయిన వారు ఈనెల 29న నూజివీడు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎస్టీయూ ఏపీ జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కొటికలపూడి జెడ్పీ పాఠశాలలో మంగళవారం సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏ బకాయిలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. మండల, జిల్లా శాఖ సభ్యులు పాల్గొన్నారు.